ఈనాడు
పెద్దపల్లి
సోమవారం అక్టోబరు 14, 2024



లక్ష్యం ఘనం.. రక్షణ మృగ్యం

పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం అభాసుపాలవుతోంది. పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ మైదానంలో గత జులైలో కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా నాటిన మొక్కలకు సంరక్షణ కరవైంది. మూగజీవాలకు మేతగా మారుతున్నాయి.
- న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రజలకు భద్రత కల్పించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం పోలీసు కమిషనరేట్‌లో శనివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. దసరా సందర్భంగా ఆయుధాలకు సీపీ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. పోలీసు అధికారులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు భద్రత కల్పించాలన్నారు. డీసీపీ భాస్కర్, రాజు, ఏసీపీ రమేశ్, మల్లారెడ్డి, నర్సింహులు, ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధ పూజ చేస్తున్న సీపీ శ్రీనివాస్

సీఎం కప్ టార్చ్ రిలే నేడు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం 9 గంటలకు సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బ్యాలెట్ పెట్టెలు సిద్ధమేనా!

పల్లె పోరు నేపథ్యంలో మరమ్మతు చేయిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పంచాయతీ ఎన్నికల్లో కీలకమైనా బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలల్లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాల్లోని గోదాంలలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెలను సరి చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లు సమీపిస్తుండటంతో వీటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా? చెడిపోయాయా? అనేది తేల్చే పనిలో ఉన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేస్తున్నారు.

పెరగనున్న వార్డులు

2018-19 పంచాయితీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీల్లో 11,132 వార్డులున్నాయి. ప్రతి వార్డులో 250 ఓటర్లు ఉంటారు. ఎన్నికల్లో వార్డుకొక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఉమ్మడి జిల్లాలో వార్డుల సంఖ్య పెరగనుంది. జిల్లాల వారీగా పెరిగిన ఓటర్ల ఆధారంగా వార్డుల లెక్కలను కొలిక్కి తేనున్నారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెలు ఎన్ని? చెడిపోయిన ఎన్ని? అని తనిఖీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు తీసుకెళ్లిన బ్యాలెట్ పెట్టెలపై ఆరా తీస్తున్నారు. వీటిని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నారు. బ్యాలెట్ పెట్టెలు పక్కదారి పక్కకుండా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రకటన లోపు అన్ని ఏర్పాటు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



పెద్దపల్లి వ్యవసాయ గోదాంలో బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేస్తున్న అధికారులు



రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

గత భారాస ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదేళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లు ఉంటాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అదే చట్టాన్ని కొనసాగిస్తుందా? కొత్త రిజర్వేషన్లు తీసుకొస్తుందా? అన్న దానిపై ఉత్కంఠ వీడటం లేదు. ఓ వైపు బీసీ కులగణన చేయాలని సంబంధ సంఘాల నేతలు పట్టుబట్టడంతో ప్రభుత్వం సర్వే చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయా వర్గాల వారు డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రస్తుత పంచాయతీల వివరాలు

● జిల్లా	★ పంచాయతీలు	■ వార్డులు
జగిత్యాల	380	3,500
పెద్దపల్లి	267	2,436
కరీంనగర్	313	2,966
రాజన్నసిరిసిల్ల	254	2,230

రైలు ప్రయాణం..
తప్పని భారం

తరచూ రద్దుపై విమర్శలు



న్యూస్‌టుడే, పెద్దపల్లి

జిల్లా నుంచి వరంగల్, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పేరుకే పెద్దపల్లి రైల్వేస్టేషన్ జంక్షన్ అయినా సేవలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. అసలే ఈ దారి గుండా రైళ్లు తక్కువగా నడుస్తుండగా.. తరచూ మరమ్మతులు పేరిట నడిచే వాటిని రద్దు చేయడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మూడో లైన్, కాజీపేట వద్ద సొరంగ నిర్మాణ పనుల వెరసి రోజుల తరబడి పలు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు పండుగ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైళ్ల రద్దు.. మహాలక్ష్మీ పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రయాసంగా మారింది. కొన్నేళ్లుగా సాగిన అవాంతరాలు తొలగడంతో కొత్త రైళ్లను ప్రవేశపెట్టడంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల పెద్దపల్లి లోక్‌సభ సభ్యుడు వంశీకృష్ణ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగ్యా, జీఎం అరుణ్‌కుమార్ జైన్‌లను కలిసి సమస్యలను ఏకరువు పెట్టడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు.

ప్రతి రోజూ పెద్దపల్లి మీదుగా వెళ్లే రైళ్ల వివరాలు

సమయం(గంటలు)	రైలు
కాగజ్‌నగర్ వైపు	
ఉదయం. 6.45	రామగిరి మెము
8.15	ఏపీ
8.30	కరీంనగర్-సిర్పూర్‌టౌన్ మెము
8.40	ఇంటర్‌సిటీ
10.35	సింగరేణి
11.30	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్
రాత్రి 07.10	భాగ్యనగర్
వరంగల్, హైదరాబాద్ వైపు	
ఉదయం 4.50	భాగ్యనగర్
మధ్యాహ్నం 1.12	ఇంటర్‌సిటీ
2.15	సింగరేణి మెము
సాయంత్రం 4.00	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్
రాత్రి 0.20	రామగిరి

రైళ్లు పెంచాలి

దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను పక్కనబెడితే స్థానిక ప్రయాణికులకు అనుకూలంగా ఉండే లోకల్ రైళ్ల సమయపాలన ప్రయాణాలకు ప్రతికూలంగా ఉండడం సమస్యగా మారింది. పెద్దపల్లి నుంచి కాగజ్‌నగర్ వైపు ఉదయం 11 వరకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. మధ్యాహ్నం లేకపోవడంతో అప్పటివరకు ప్రయాణికులు రాత్రి వరకు వేచి చూడాల్సిందే. లేకపోతే బస్సులో వెళ్లాలి. వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఉదయం 5 గంటల తర్వాత మధ్యాహ్నం 1 వరకు రైళ్లే లేవు. దూరప్రాంతాలకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా లోకల్ రైళ్ల సమయంలోనే రావడంతో ప్రయోజనం లేకుండా పోతుంది. జిల్లాలో పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, రామగుండంలలో రైల్వే స్టేషన్‌లు ఉండటంతో జిల్లావాసులు ప్రభావితం అవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి గతంలో రద్దయిన కాజీపేట-బల్హార్షా ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించడంతో పాటు కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వైపు ఉదయం, సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వైపు మధ్యాహ్నం సమయంలో మరో రైలును నడిపించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.



పెద్దపల్లిలో రైలు కోసం ప్రయాణికుల నిరీక్షణ

పుణెకు మరో రైలు

కాజీపేట నుంచి పుణెకు ప్రస్తుతం నడుస్తున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా మరొటి నడిపించేందుకు మధ్య రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. కాజీపేట నుంచి ప్రతి బుధవారం బయలుదేరే ఈ రైలు పుణేకు మరుసటిరోజు చేరుతుంది. ఈ రైల్లో జిల్లా ప్రయాణికులు ఆదిలాబాద్ వెళొచ్చు. త్వరలో ప్రారంభమయ్యే ఈ రైలు పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లలో ఆగుతుంది. పుణే మార్గంలో ప్రయాణికులు పెరగడంతో రెగ్యులర్ వీక్లీ రైళ్లతో పాటు మరో రెండు ప్రత్యేక రైళ్లు జిల్లా నుంచి వెళ్తున్నాయి. అయితే జిల్లా మీదుగా వెలుతున్న నాగ్‌పూర్-సికింద్రాబాద్ వందేభారత్‌కు ప్రయాణికులకు లేకపోవడంతో బోగీలను తగ్గించేందుకు రైల్వే అధికారులు సమాయత్తమవుతున్నారు. గత నెలలో ప్రారంభమైన ఈ రైలుకు మన రాష్ట్రంలో రామగుండం, కాజీపేటలో మాత్రమే హాల్టింగ్ ఇచ్చారు. ఎక్కువ ప్రయాణికులుండే కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లిలలో ఆగకపోవడంతో రైలు ఖాళీగా వెళ్తుందనే ప్రచారం జరగుతోంది.

ఆకట్టుకున్న అకాడ ప్రదర్శన



పట్కా, డాల్‌తో..



మంటలతో విన్యాసం చేస్తున్న శిక్షకులు నాగరాజు

గోదావరిఖని, జ్యోతినగర్ (మార్కండేయకాలనీ): దసరా వేడుకల సందర్భంగా గోదావరిఖనిలో నిర్వహించిన అకాడ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఖని హనుమాన్‌నగర్‌కు చెందిన జైభారత్ హనుమాన్, శ్రీహనుమాన్ అకాడల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కత్తి, కర్రసాముతోపాటు మంటలతో విన్యాసాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు.

ఘనంగా దసరా వేడుకలు



యువతి జానపద నాట్యం

దసరా పండుగను జిల్లా ప్రజలు అట్టహాసంగా చేసుకున్నారు. జమ్మిచెట్టు వద్ద శమీ పూజ చేసి ఒకరికొకరు జమ్మి ఆకులు పంచుకొని ఆలయ్-బలయ్ చేసుకొని దసరా శుభకాంక్షలు తెలుపుకొన్నారు. కొన్ని ప్రాంతాల్లో దుర్గామాత నిమజ్జనాలు.. రావణసుర దిష్టిబొమ్మ దహన కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంథనిలోని గాంధీ చౌక్‌లో భజరంగ్‌దల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనంలో మహిళాల బోనాలు, డోలు వాయిద్యా కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి, గోదావరిఖనిలలో ఘనంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర, రావణసుర వధ కార్యక్రమాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం



పెద్దపల్లిలో అమ్మవారి శోభాయాత్ర



సెంటినరీకాలనీ క్రీడామైదానంలో రావణ దహనం



గోదావరిఖనిలో రేణుక ఎల్లమ్మ నృత్యం చేస్తూ..



ఖని: దసరా వేడుకలకు హాజరైన జనం



మంథనిలో దుర్గామాత నిమజ్జనంలో మహిళల బోనాలు

రెండు జిల్లాల వారధి..
పట్టించుకునే వారేరి?



ధ్వంసమైన రెయిలింగ్



వంతెన మధ్యలో ప్రమాదకరంగా గుంత

మంథని మండలం అడవి సోమన్‌పల్లి వద్ద మానేరు వాగుపై ఉన్న వంతెన రెయిలింగ్‌ను గత నెల 30న ఇంధన ట్యాంకర్ ఢీ కొనడంతో ఒక పక్క కొంత భాగం కూలిపోయింది. పక్షం రోజులు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. పెద్దపల్లి-జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఈ వంతెన వారధి కాగా.. దీనిపై నుంచి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెయిలింగ్ దెబ్బతినడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వంతెన మధ్యలో గుంత కూడా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మంథని గ్రామీణం**

అనుమతులు వస్తేనే.. అత్యాధునిక సేవలు



న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ఎట్టకేలకు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలోని రక్తబ్యాంకులో అత్యాధునిక సేవలకు సమర్పించిన దరఖాస్తులను కేంద్ర ఔషధ నియంత్రణశాఖ ఆమోదించింది. రెండేళ్ల క్రితమే మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తెచ్చినప్పటికీ.. వాటికి సరిపడే వైశాల్యంలో భవనం లేనందున దరఖాస్తులను ఔషధ నియంత్రణశాఖ తిరస్కరించడంతో పాటు చేపట్టాల్సిన చర్యలపై సూచనలిచ్చింది. దీనికి అనుగుణంగా ఏడాది క్రితం రక్తబ్యాంకు పాత భవనం పక్కనే అదనంగా మరో నిర్మాణం చేపట్టడంతో అనుమతికి మార్గం సుగమమైంది.

సంయుక్తంగా పరిశీలించి..

దరఖాస్తుల ప్రకారంగా క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ఔషధ నియంత్రణశాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి సంతృప్తి చెందాకే అత్యాధునిక సేవల నిర్వహణకు అనుమతులు మంజూరు చేయనున్నారు. ప్రస్తుత రక్తబ్యాంకు లైసెన్సు మరో రెండు నెలల్లో ముగియనుంది. పాత లైసెన్సును రెన్యువల్ చేయడంతోపాటు కొత్త సేవలకు అనుమతులు మంజూరు చేసేందుకు ఒకేసారి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్నట్లు భావిస్తున్నారు.



ఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని బ్లడ్‌బ్యాంకు భవనం

రూ.38 లక్షల వ్యయంతో..

ఖనిలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నెలకొల్పినప్పుడు.. అదే భవనంలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కేవలం కరీంనగర్ రక్తబ్యాంకు నుంచి రక్తం తీసుకొచ్చి.. నిల్వ కేంద్రంలో భద్రపరిచి అవసరమైనవారికి సరఫరా చేసేవారు. నాలుగున్నరేళ్ల క్రితం నిల్వ కేంద్రాన్ని రక్తబ్యాంకుగా మార్చారు. దీంతో ఇక్కడే రక్తాన్ని సేకరిస్తున్నారు. రక్తదాన శిబిరాలూ నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో ప్లాస్మా, రక్తకణాల విభజన సదుపాయం స్థానికంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఎన్టీపీసీ యాజమాన్యం దాదాపు రూ.38 లక్షల వ్యయంతో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రాన్ని సమకూర్చారు.

వినియోగంలోకి తీసుకొస్తేనే..

ప్లాస్మా, రాండమ్ ప్లేట్‌లేట్ సపరేటర్, రెండు ప్లాస్మా స్టోరేజీ రిఫ్రిజిరేటర్లు, మరో రెండు ఇంక్యుబేటర్లను ప్రభుత్వం సమకూర్చింది. వీటన్నింటికి విశాలమైన భవన నిర్మాణంతోపాటు.. క్రయోపూర్ ప్లాస్మా, క్రయో పెస్టిరేట్, కోఆగ్లోమీటర్లను సమకూర్చుకున్నాకే దరఖాస్తు చేసుకోవాలని ఔషధ నియంత్రణ శాఖ పేర్కొంది. సుమారు రూ.15లక్షల వ్యయంతో భవన నిర్మాణం పూర్తికావడంతోపాటు వారు సూచించిన సామగ్రిని సమకూర్చుకున్నారు. గోదావరిఖని రక్తబ్యాంకులో ఏర్పాటుచేసిన అత్యాధునిక యంత్రాలను వినియోగంలోకి తీసుకువస్తే అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

అన్నిరకాల సేవలకు ప్రయత్నాలు

రక్తానికి సంబంధించిన అన్ని రకాల సేవలను స్థానికంగానే అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. త్వరలోనే రక్తకణాల విభజనతోపాటు రక్తానికి సంబంధించిన అత్యాధునిక సేవలు అందుబాటులోకి రానున్నాయి.
- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని



నీరుండీ నిర్లక్ష్యం.. ఏటా దుర్భిక్షం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం, హుజూరాబాద్, పెద్దపల్లి

- ఎస్సారెస్పీ ఆయకట్టుకు తప్పని కరవు
- కాలువలకు మరమ్మతు లేక కర్షకులకు కష్టాలు

పరిశీలన

ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ కింద దాదాపు 5.56 లక్షల ఎకరాల ఆయకట్టుంది. కాలువలు నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు ఏనాడూ పూర్తి స్థాయిలో నీరందలేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట వేసిన సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం, తూములు, డ్రాపులు, యూటీలు పాడవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీటి వినియోగ సంఘాలు రద్దు కావడంతో నిర్వహణ అటకెక్కింది. కాలువలు భారీగా దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ఎస్సారెస్పీ కాలువల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన ఇది.

గరిష్ఠ నీటి నిల్వ : 80.501 టీఎంసీలు
ప్రస్తుతం 80.501 టీఎంసీలు


శ్రీరామ సాగర్ జలాశయం(ఎస్సారెస్పీ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవసాయానికి ప్రాణాధారం.. ఈ ఏడాది భారీ వర్షాలకు నిండు కుండలా మారింది.. యాసంగి సీజన్ ఆరంభం కానుండగా రైతులు కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు.. వారి కలలను కాలువలు వెక్కిరిస్తున్నాయి.. పూడికతో పేరుకుపోయి, పిచ్చిమొక్కలతో కమ్ముకుపోయి, ప్రవాహాన్ని ముందుకెళ్లనీయని నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.. అదునులో చేయాల్సిన పనులను గుర్తు చేస్తున్నాయి..

1 మొత్తం ఆయకట్టు విస్తీర్ణం
2 ప్రస్తుతం సాగులో ఉన్న విస్తీర్ణం
3 మొత్తం డిస్ట్రిబ్యూటరీ కాలువల పొడవు
4 పంట కాలువల పొడవు
5 పూర్తి స్థాయిలో నీరందకపోవడానికి కారణాలు
6 సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
7 మరమ్మతుకు అవసరమైన నిధులు/ప్రతిపాదనలు
8 ఉపాధిహామీలో పూడికతీత పనులు



మానకొండూర్ మండలం పచ్చునూరు శివారులో గండి పడిన డీబీఎం-6(4ఎల్) ఉపకాలువ


కరీంనగర్



1 1.40 లక్షల ఎకరాలు 2 1.12 లక్షల ఎకరాలు
3 20 డిస్ట్రిబ్యూటరీలు, 200 కిలోమీటర్లు
4 500 కిలోమీటర్లు
5 కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, డ్రాప్స్, లైనింగ్, తూముల షట్టర్లు కూలిపోవడం, కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లు పెరగడం, సిల్ట్ పేరుకుపోవడం. 6 ప్రత్యేకంగా ఏమీ లేవు.
7 రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వానాకాలం సీజన్ నీటి విడుదల నిలిపివేసిన అనంతరం పనులు చేసేలా ప్రణాళిక రూపొందించారు.
8 మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోని సబ్ మైనర్ కాలువల్లో కొంతమేర పూడికతీత పనులు చేశారు. డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల్లో పనులు చేయాల్సి ఉంది.

ఇలా చేస్తే ప్రయోజనం

- మరో రెండు నెలల్లో యాసంగి వరి నాట్లు మొదలు కానుండటంతో ఈలోగా ఉపాధిహామీలో కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కలు, చెట్ల తొలగింపు పనులు చేపట్టాలి.
- జగిత్యాల జిల్లాలో కాకతీయ కాలువతో పాటు వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జల మట్టం పెరిగి పంపుసెట్ల ద్వారా నీటిని పారించే వీలుంటుంది.
- అన్ని కాలువలకు లైనింగ్ పనులు చేయాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతులు పూర్తి చేస్తే చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందుతుంది.



శ్రీరాంసాగర్ జలాశయం

జగిత్యాల



1 1.63 లక్షల ఎకరాలు 3 136 కిలోమీటర్లు
2 1.27 లక్షల ఎకరాలు
4 401 కిలోమీటర్లు
5 కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగడం, షట్టర్లు, కట్టలు శిథిలం కావడం తదితర కారణాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన కాకతీయ కాలువలో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువ నీటిని వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజీలు, అక్విడెక్టులు దెబ్బతినడంతో గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించలేని పరిస్థితి.
6 బీర్పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, బుగ్గారం, సారంగాపూర్, కోరుట్ల, మల్యాల, గొల్లపల్లి, ఎండపల్లి, పెగడపల్లి మండలాల్లోని చివరి ఆయకట్టు గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు.
7 రూ.176.31 కోట్లు. ఇటీవల రూ.91 కోట్లతో మరమ్మతులు చేశారు. 62 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.
8 గతేడాది నుంచి దాదాపు 65 కిలోమీటర్ల దూరం కాలువల్లో పూడిక, చెట్లు, ముళ్లపొదల తొలగింపు పనులు చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో అన్ని ప్రాంతాల్లోనూ తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంది.



జగిత్యాల మండలంలో దెబ్బతిన్న కాకతీయ కాలువ లైనింగ్

పెద్దపల్లి



1 2.50 లక్షల ఎకరాలు
2 1.80 లక్షల ఎకరాలు.
3 139 కిలోమీటర్లు.
4 640 కిలోమీటర్లు.



ఎలిగేడు మండలం శివపల్లి వద్ద దెబ్బతిన్న డి-86 కాలువ (పాతచిత్రం)

5 జిల్లాలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పాతికేళ్ల కిందట చేసిన లైనింగ్ పనులు దెబ్బతినడంతో ఏనాడూ పూర్తి స్థాయిలో ప్రవాహం ఉండటం లేదు. 2022 వరకు కాలువల మరమ్మతులు ఉపాధిహామీలో నిర్వహించడం, అనంతరం గ్రామ స్థాయిలోనే చేపడుతుండటంతో పర్యవేక్షణ కరవైంది.
6 ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాలు,
7 జూలపల్లి మండలం కుమ్మరికుంట, పాలకుర్తి మండలం కన్నాల, కుక్కలగూడూరు వద్ద అండర్ టన్నెల్(యూటీ) కాలువల నిర్మాణానికి రూ.1.8 కోట్లతో ప్రతిపాదించారు. డి-86 పరిధిలో కాలువల మరమ్మతులకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు.
8 ప్రస్తుతం సమస్య ఉన్న గ్రామాల్లోనే పంచాయతీల ఆధ్వర్యంలో ఉపాధిహామీలో పనులు చేస్తున్నారు. కేవలం పూడికతీత, చెట్ల తొలగింపు వరకే పరిమితమవుతుండటంతో కొద్ది రోజులకే సమస్య మొదటికొస్తోంది.

కొండగట్టులో అన్నదాన సత్రం నుంచి సరకులు మాయం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయ అన్నదాన సత్రం నుంచి నిత్యావసర సరకులు మాయమైనట్లు తేలడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈనెల 9న అన్నదాన సత్రం నుంచి బియ్యం బస్తాలతో పాటు వివిధ రకాల నిత్యావసర సరకులను ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో అధికారులు శనివారం గుర్తించారు. గతంలో కూడా సరకులు మాయమైనట్లు ఆరోపణలున్నాయి. రెండు నెలల కిందట వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి బదిలీపై వచ్చిన రాములు(జూనియర్ అసిస్టెంట్) అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అన్నదాన సత్రం నుంచి బియ్యంతోపాటు ఇతర సరకులు మాయమైనట్లు బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా రాములు అనే ఉద్యోగి అన్నదాన సత్రం నుంచి ఓ ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టామని సరకులను తరలించిన ఆటోను కూడా రప్పించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈవో అంజయ్యను సంప్రదించగా అన్నదాన సత్రం ఇన్‌ఛార్జి రాములు ఈనెల 9న గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే ఆటోలో బియ్యం బస్తాలను, తన ద్విచక్రవాహనంలో నిత్యావసర సరకులను తీసుకెళ్లినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేపట్టామన్నారు. ఆదివారం సాయంత్రం రాములుకు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. అన్నదాన సత్రం నుంచి ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నా తనిఖీ చేయకపోవడంపై కొండపైన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పండుగ వేళ తీరని విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

మరో రెండు నిమిషాల్లో బంధువుల ఇంటికి చేరాల్సిన యువకుడి ప్రాణాలు గాలిలో కలిశాయి.. స్నేహితులతో కలిసి కొత్త బట్టలు కుట్టించుకుందామని వెళ్లిన ఆటో డ్రైవర్ వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించారు.. దుర్గామాత నిమజ్జనోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తూ మరో యువకుడు విద్యుదాఘాతానికి బలయ్యారు.. అత్తగారింటికి పయనమైన ఇంకో యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.. చిన్నతనంలో కన్నవారికి దూరమై 12 ఏళ్ల అనంతరం తిరిగొచ్చిన యువకుడు పొరుగు జిల్లాలో మృత్యువాత పడ్డారు.. శని, ఆదివారాల్లో జరిగిన పలు ప్రమాదాలు పండుగ వేళ ఉమ్మడి జిల్లాలో తీరని విషాదం నింపాయి..

-న్యూస్‌టుడే బృందం

పెద్దమ్మ ఇంటికి వెళ్తూ..



వినయ్

శంకరపట్నం: తాడికల్‌లో జరిగిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందారు. కేశవపట్నం ఎస్సై రవి కథనం ప్రకారం చిగురుమామిడి మండలం లంబాడిపల్లికి చెందిన బండారిపల్లి వినయ్(25) కరీంనగర్‌లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి రావడానికి కరీంనగర్ నుంచి బయల్దేరారు. తాడికల్ గ్రామ శివారులోకి చేరుకోగానే మలుపు వద్ద ద్విచక్రవాహనం అతి వేగంతో అదుపు తప్పింది. రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వినయ్ అక్కడికక్కడే మృతి చెందారు. కొన్ని క్షణాల్లో పెద్దమ్మ ఇంటికి చేరుకోవాల్సిన వినయ్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో విగతజీవిగా..



త్రినాథ్

మానకొండూర్ : యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మానకొండూర్ మండలం వెల్దిలో విషాదం నింపింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్(19) ఆటో నడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం స్నేహితులు కొమ్మగల్ల కిరణ్, రుద్రారం స్వస్తిక్, రామగిరి సందీప్‌తో కలిసి ప్యాంటు కుట్టించుకోవడానికి ఆటోలో రంగపేటకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలైనా ఇంటికి రాకపోవడంతో త్రినాథ్‌కు తండ్రి నాంపెల్లి ఫోన్ చేయగా బయల్దేరామని సమాధానమిచ్చారు. సాయంత్రం 7 గంటల సమయంలో 'త్రినాథ్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడ్డాడ'ని కిరణ్ ఫోన్ చేసి చెప్పారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా, పోలీసుల ఆధ్వర్యంలో బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం త్రినాథ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కిరణ్, స్వస్తిక్, సందీప్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తూ..



రాజు

సుల్తానాబాద్: భూపతిపూర్ శివారులోని రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచెరామికి చెందిన సింగారపు రాజు(29) దుర్మరణం చెందారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం రాజు ద్విచక్రవాహనంపై దుబ్బపల్లి వైపు నుంచి భూపతిపూర్‌లోకి అత్తగారింటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కింద పడిన రాజుపై నుంచి మరో వాహనం వెళ్లడంతో దుర్మరణం చెందారు. మృతదేహం నుజ్జయింది. మృతుడికి భార్య, రెండేళ్లు, నాలుగు నెలల వయసున్న కూతుళ్లున్నారు.

ఉత్సవాలకు సిద్ధం చేస్తూ..



వెంకటేశం

బీమారం: బీమారం మండలం రాగోజిపేటలో దుర్గామాత ఊరేగింపు అనంతరం మహిషాసుర దహనం కోసం అరిసెల వెంకటేశం(36) తీగ చుడుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో కింద పడిపోయారు. వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

తప్పిపోయి తిరిగొచ్చిన నాలుగేళ్లకే..



రవీందర్‌రెడ్డి

ఓదెల, లింగాలఘనపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల చిన్న మోరీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వడ్డిచర్ల, మృతుడి గ్రామస్థులు, ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) నల్గొండలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట తండ్రి రాంచంద్రారెడ్డి మృతి చెందగా తిథి కోసం కారులో స్వగ్రామానికి వస్తుండగా జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిలో లింగాలఘనపురం మండలంలోని వడ్డిచర్లలో కారు అదుపుతప్పి డివైడర్‌ను, కల్వర్టు గోడను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108లో జనగామ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. రవీందర్‌రెడ్డి జమ్మికుంటలో చదువుతున్న సమయంలో తప్పిపోయి 12 సంవత్సరాలు తల్లిదండ్రులకు దూరమై నాలుగేళ్ల క్రితమే స్వగ్రామం వచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రియుడి హత్యతో మనస్తాపం

మహిళ బలవన్మరణం

గుంటూరు, యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ప్రియుడు హత్యతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నల్లచెరువుకు చెందిన కాకినాడ అంజలి(29)కి.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికు చెందిన శివరామకృష్ణలకు కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. మూడు నెలలుగా భర్త, పిల్లల్ని వదిలిన అంజలి ప్రియుడితో సహ జీవనం చేస్తోంది. ఈ నెల 10న అంజలి భర్త శివరామకృష్ణ, సోదరుడు కుమార్‌లు కలిసి వినయ్‌కుమార్‌ను హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి గోదావరిఖని పోలీసులు శివరామకృష్ణ, కుమార్‌లను శనివారం అరెస్టు చేశారు. అప్పటి నుంచి అంజలి గుంటూరు నల్లచెరువులోని తన కుటుంబసభ్యులు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఓవైపు ప్రియుడు హత్యకు గురికావటం.. కుటుంబ సభ్యులు నుంచి అదరణ లేకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంజలి.. శనివారం గుంటూరు వర్కర్స్‌కాలనీలోని తన పిన్ని కనకలక్ష్మి ఇంటికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కళ్లెదుటే రైలు కింద పడి భర్త...

ఓదెల : వేధింపులపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమె కళ్లెదుటే భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఓదెల మండలం పొత్కపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలకుంట గ్రామానికి చెందిన రెడ్డి ఆదిత్య(32) పొత్కపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసై తరచూ భార్య కవితను వేధింపులకు గురి చేసేవారు. ఆదివారం సాయంత్రం కూడా ఆదిత్య భార్యతో గొడవపడ్డారు. దీంతో కవిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నీపై ఫిర్యాదు చేసి వచ్చినట్లు భర్తతో తెలిపింది. నాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ఇంటి పక్కనే ఉన్నా రైల్వేట్రాక్ పైకి పరుగెత్తుకుంటూ వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి భార్య చూస్తుండగానే ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిత్యకు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆ బస్సులకు మహిళలే యజమానులు

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, రవాణా విభాగం

- 61 మండల సమాఖ్యలతో కొనుగోలు
- ఆర్టీసీకి అద్దె.. అతివలకు ఉపాధి
- పైలట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లా

మహిళా ప్రగతి రథ చక్రాలు రోడ్డెక్కేందుకు కార్యాచరణ మొదలైంది. మండల మహిళా సమాఖ్యలతో బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇప్పించి.. వారికి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ, టీజీఎస్-ఆర్టీసీ రవాణా శాఖల సంయుక్త నిర్వహణలో ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సులను మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలన్న నిర్ణయంలో భాగంగా మొదట మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కూడా ఒకటిగా ఉంది. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలను కూడా చేర్చారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా...

జిల్లా	మండలాలు	కొనుగోలు బస్సులు
కరీంనగర్	15	15
జగిత్యాల	20	20
పెద్దపల్లి	14	14
సిరిసిల్ల	12	12

ప్రాథమికంగా నిర్ణయం..

ఈ బాధ్యతను మెప్మాతోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. వాటి ఖాతాల్లో ఉన్న కొంత డబ్బుతోపాటు బ్యాంకు రుణ సదుపాయం, ప్రభుత్వ రాయితీ వంటి వాటిని జోడించి బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అద్దె బస్సుల్లోనూ అవసరమైన వారికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఇందుకు అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో మహిళా శక్తిని చాటే అవకాశముంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 100 నుంచి 150 సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వాటి ద్వారా బస్సులు కొనాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

తీరనున్న బస్సుల కొరత..

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 860 బస్సులు ఉండగా, ఇందులో 333 అద్దెవి ఉన్నాయి. ఇవి కాకుండా ఇటీవల 33 ఎలక్ట్రిక్ బస్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అంతకుముందు రీజియన్ వ్యాప్తంగా 2 లక్షల మంది ప్రయాణించగా పథకం అమల్లోకి వచ్చాక ఈ సంఖ్య అయిదు లక్షలకు చేరింది. ఉన్న వాటితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని సందర్భాల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 61 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. బస్సుకు ఇద్దరు చొప్పున చోదకులను తీసుకున్నా మరో 122 మందికి ఉపాధి లభించనుంది.

విధి విధానాలు రూపొందిస్తున్నాం

మండల సమాఖ్యల ద్వారా బస్సుల కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు రూపొందిస్తున్నాం. మొదట కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ అమలు చేసిన తర్వాత అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తాం. మహిళా శక్తి ద్వారా ఉపాధి కల్పించనున్నాం. త్వరలోనే తుది రూపకల్పన ప్రకటిస్తాం.

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

చలనచిత్ర పోస్టర్ విడుదల

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖనిలో కళాకారులు నటించిన చలన చిత్ర పోస్టర్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శనివారం రాత్రి విడుదల చేశారు. ఖనికి చెందిన అజారుద్దీన్ ఈ సినిమా నిర్మించారు. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు. నటీనటులు సురేశ్, రాకేశ్, అనీస్, గోపి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

గోదావరిఖని: పట్టణానికి చెందిన సీనియర్ తెదేపా నాయకులు కొత్త రాజిరెడ్డి(75) ఆదివారం స్వర్గస్థులయ్యారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన సుదీర్ఘకాలం తెదేపాలో పనిచేశారు. రాజిరెడ్డి మృతిపట్ల ఆయన సన్నిహితులు, స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. నాయకులు తదితరులున్నారు.


కొత్త రాజిరెడ్డి


పూజల కోసం బారులు తీరిన వాహనాలు

కొండగట్టులో వేడుకలు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయంలో శ్రీసీతా రామ లక్ష్మణ విగ్రహాలను శనివారం అశ్వవాహనంపై ముత్యంపేట పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, సిబ్బంది పాల్గొన్నారు. కొండగట్టు ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి ఎ.నీరజ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్ న్యాయమూర్తి దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదం అందించగా, అర్చకులు ఆశీర్వదించారు.

వాహనపూజల ఆదాయం రూ.3.37 లక్షలు

దసరా రోజు కొండగట్టులో వాహన పూజలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. వాహన పూజల ద్వారా ఆలయానికి రూ.3.37 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు.

నేర వార్తలు

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని నల్లపోచమ్మవాడలో నివాసముండే భవన నిర్మాణ కార్మికుడు గరిగంటి సదయ్య(45) బలవన్మరణానికి పాల్పడ్డట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదయ్య మద్యానికి అలవాటు పడి తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఇది భరించలేక సదయ్య పన్నెండేళ్ల కూతురు రెండు రోజుల క్రితం పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఒంటరిగా ఉన్న సదయ్య మద్యంమత్తులో పురుగు మందు తాగాడు. తెల్లవారు జామున ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన భార్య స్వప్న ఇంట్లో చనిపోయిన ఉన్న భర్తను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి కుమారుడు కూడా ఉన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు..

ధర్మారం, న్యూస్‌టుడే: మండలంలోని ఖిలావనపర్తికి చెందిన నక్క బీమమ్మ(80) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లిన బీమమ్మ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. ఇంటికి సమీపంలోనే ఉన్న వ్యవసాయ బావిలో బీమమ్మ మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించారు. రెండేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న బీమమ్మ చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తితో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని బీమమ్మ కొడుకు కొమురయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఎన్టీపీసీకి చెందిన పోతు అశోక్ కరీంనగర్ నుంచి తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి సుగ్లాంపల్లి వద్ద రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో స్వల్పగాయాలతో అశోక్ బయటపడ్డారు.

కార్మికుడి చేతికి తీవ్ర గాయాలు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీలోని యూనిట్-1 సీహెచ్‌పీ విభాగం బంకర్‌లో పనిచేస్తున్న కార్మికుడు సదానందానికి.. ప్రమాదవశాత్తు శనివారం తన చేతివేళ్లు యంత్రంలో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే యాజమాన్యం చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రి తరలించింది. ఈ క్రమంలో ఎన్టీపీసీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఐఎఫ్‌టీయూ విమర్శించింది.

దసరా ఉత్సవాల్లో ఘర్షణ

పలువురిపై కేసు

గోదావరిఖని, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో గలాట సృష్టించిన పలువురిపై గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సింగరేణి క్రీడా మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన దసరా వేడుకల్లో ఇరు వర్గాలకు చెందినవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఇరు వర్గాలకు చెందిన తొమ్మిదిమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీరు సీసాలతో దాడి

గోదావరిఖని: పాతకక్షల నేపథ్యంలో స్థానిక మార్కండేయకాలనీకి చెందిన రణధీర్‌రెడ్డి, అతని సోదరుడు సంజయ్‌రెడ్డి, మరో మిత్రుడు వెంకటేశ్‌లపై.. గోదావరిఖనికి చెందిన అరవింద్, నిఖిల్ రెడ్డి, శ్రీనివాస్‌లు దాడికి పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. బీరుసీసాలు, బండరాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారంతో.. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ఓదెల మల్లికార్జున ఆలయంలో శమీ పూజ


ధర్మారం: అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో భక్తుల కోలాటం



ధర్మారంలో జంబి గద్దె వద్ద..


ఖని: గౌతమినగరం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో..


భక్తి శ్రద్ధలతో దసరా

జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శనివారం సాయంత్రం డప్పు చప్పుల నడుమ అందరూ కలిసి వెళ్లి జమ్మి చెట్టు వద్ద శమీ పూజ నిర్వహించారు. అనంతరం జమ్మి ఆకులు పరస్పరం ఇచ్చుకొని దసరా శుభ కాంక్షలు తెలుపుకొన్నారు. మంథనిలో రాత్రి లక్ష్మీనారయణస్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించి కోర్టు సమీపంలోని జమ్మిచెట్టు చుట్టూ ప్రదర్శన చేసి ఆలయానికి చేరుకున్నారు. వివిధ గ్రామాల్లో దుర్గామాత నవరాత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. మండపాల్లో, ఆలయాల్లో శనివారం, ఆదివారం ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారిని ఘనంగా నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే, యంత్రాంగం


ఖనిలో రావణ దహనం


ఖని: జానపద నృత్యం చేస్తున్న కళాకారులు


జూలపల్లి: అబ్బాపూర్‌లో మహిషాసురుని దహనం


ఓదెలలో దుర్గాదేవి ఊరేగింపు


కళాకారుల నృత్య ప్రదర్శన


తలపై దీపాలతో కళాకారుని ప్రదర్శన


శక్తిస్వరూపిణి రూపంలో


మంథని: చిల్లపల్లిలో దుర్గామాత శోభాయాత్ర


రావణవధ అనంతరం ఈడీ కేదార్‌రంజన్‌పాండు, ఇతర అధికారులు


బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ కర్మాగారంలో..


మంథని పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


సుల్తానాబాద్‌లో అలయ్-బలయ్


నగరపాలిక సీనియర్ సిటిజన్ పార్కు(పాత చిత్రం)


అర్ధంతరంగా ఆగిన బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం

సాగని నిర్మాణం.. అందని ఆహ్లాదం

వయోవృద్ధులకు ఆహ్లాదాన్ని పంచాలనే లక్ష్యంతో నగరపాలిక ఆధ్వర్యంలో నిర్మించిన ఉద్యానవనాన్ని తొలగించి.. దానిస్థానంలో బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం చేపట్టారు. నిధుల లేమితో నిర్మాణ పనులు పునాదులకే పరిమితమైంది. దీంతో ఆహ్లాదాన్ని పంచే పార్కును కోల్పోగా.. అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణంతో ఈ ప్రాంతం నిరుపయోగంగా మారింది.

- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

వైభవంగా విజయదశమి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి క్షేత్రంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఆయా క్వార్టర్ల సమీపంలో జమ్మి పూజ నిర్వహించుకొని ఒకరికొక్కరు ఆకులు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సెంటినరీకాలనీలోని రాణిరుద్రమదేవి క్రీడామైదానంలో జీఎంలు సుధాకర్‌రావు-అలివేణి, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు-విజయలక్ష్మి దంపతులు జమ్మి పెట్టుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కార్మిక సంఘాలు సైతం జీఎంలకు జమ్మి అందించారు. రావణాసుర వధ(రామ్‌లీలా దసరా ఉత్సవాలు) కార్యక్రమాన్ని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జీఎం సుధాకర్‌రావు హాజరై మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా కార్మికులు కృషి చేయాలన్నారు. ఎస్వోటూ జీఎం రఘుపతి, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, అధికారులు రాజేశం, రాజేంద్రప్రసాద్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతియాదవ్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వైవీరావు, ఎమ్మార్సీరెడ్డి, రవీందర్‌రెడ్డి, రామారావు, డీటీరావు, రమేశ్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం సుధాకరరావు




రామ్‌లీలా కార్యక్రమాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన ప్రజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ పరిధి బాపూజీనగర్‌లోని మాతృశ్రీ విద్యాలయంలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పిల్లిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకొని అనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భోజరాజు శ్రీనివాస్, సాంబయ్య, భూపెల్లి మల్లేశ్, ఆరేపల్లి శంకర్, జంగపెల్లి రాజేశ్, కిషన్‌లకు జ్ఞాపికలను అందించి శాలువాతో సత్కరించారు.

సంక్షిప్తం

■ **భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు**

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని పోతారంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు, సీఎస్‌సీ ఆరోగ్య సంరక్షణ జిల్లా సమన్వయకర్త తిరుపతి సూచనలతో కార్యదర్శి దివ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశారు. సంక్షేమ బోర్డు లేబర్ కార్డు ఉన్న కార్మికులకు 50 రకాల పరీక్షలు నిర్వహించారు. 22 మంది కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు సీసీ రోజా తెలిపారు. రమ్య, కుమార్ పాల్గొన్నారు.

■ **పిరమిడ్ నిర్మాణానికి భూమిపూజ**

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారంలో ధ్యానం చేసేందుకు పిరమిడ్ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. పిరమిడ్‌లో ధ్యానం చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని సీనియర్ మాస్టర్లు గుంటి తిరుపతి, డిల్లీశ్వర్‌రెడ్డి, మాదవ్ పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ ఎలగందుల అశోక్‌కు చెందిన స్థలంలో ఈ పిరమిడ్ నిర్మిస్తున్నారు. క్లబ్ ప్రతినిధులు సురేందర్, శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు.

■ **బాధిత కుటుంబానికి పరామర్శ**

ముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాదర్ల హరీష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి కుటుంబాన్ని మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. డాక్టర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముత్తారం మండలాధ్యక్షుడు దొడ్డ బాలాజీ, అడవిశ్రీరాంపూర్ మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి ఉన్నారు.



పాస్టర్లకు సన్మానం

మంథని, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్న పాస్టర్ల సేవాలు మరువలేనివని ఇంటర్నేషనల్ మిషన్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మంథనిలోని సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాస్టర్లను సత్కరించారు. సంఘ పెద్దలు జోసెఫ్, ప్రసాద్, రమేష్, సదానందం, పాస్టర్లు ప్రభాకర్, మహేష్‌లు పాల్గొన్నారు.

‘మల్లన్న’ సన్నిధిలో న్యాయమూర్తుల పూజలు

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని విజయదశమి రోజున మంథని కోర్టు న్యాయమూర్తి మొగుళ్ల స్వాతి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో శనివారం ఆలయానికి వచ్చిన ఆమె ఆలయ గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


మల్లికార్జునస్వామిని దర్శించుకొన్న మంథని కోర్టు న్యాయమూర్తి స్వాతి దంపతులు


సృజన్‌కుమార్‌ను సన్మానిస్తున్న యువకులు

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

ధర్మారం: మండలంలోని కమ్మర్‌ఖాన్‌పేటకు చెందిన జవ్వాజి సృజన్‌కుమార్ ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో గణిత విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ మాల సంఘం, యువకుల ఆధ్వర్యంలో సృజన్‌కుమార్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు.

యునెస్కో వ్యవస్థాపక విద్యాసదస్సులో కొమిరె వాసి

ఓదెల, న్యూస్‌టుడే: యునెస్కో వ్యవస్థాపక విద్యాసదస్సులో మండలంలోని కొమిరె గ్రామానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 10, 11న ఉజ్బెకిస్థాన్ దేశం తాష్కెంట్‌లో రెండు రోజుల పాటు విద్యాసదస్సులు జరిగాయి. యువత 21వ శతాబ్దపు సంక్లిష్ట సవాళ్లను అధిగమించి విజయవంతమైన భవిష్యత్తును పెంపొందించడం కోసం వ్యవస్థాపక విద్య ప్రాముఖ్యత గురించి ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వ్యవస్థాపక విద్య కార్యాక్రమాలు వాటి ఫలితాలపై మల్లారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 40 దేశాల నుంచి 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మల్లారెడ్డి ప్రస్తుతం హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.


డాక్టర్ మల్లారెడ్డి

పైపులైన్ల లీకేజీలు.. కార్మికుల ఇబ్బందులు



యైటింక్లయిన్‌కాలనీలో నీటి పైపులైన్ లీకేజీల సమస్య తీవ్రమవుతోంది. పైపులైన్ల వద్దనున్న చెట్లు ఏపుగా పెరిగి వాటి వేర్ల ప్రభావంతో పలుచోట్ల ధ్వంసమై నీరు వృథా అవుతోంది. కాలనీలో నిత్యం దాదాపు 2 లక్షల గ్యాలన్ల నీటిని కార్మికవాడలకు సరఫరా అవుతోంది. లీకేజీల సమస్యతో పలు కాలనీలో నీరందక ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ

రోడ్లపైనే వానరాలు



మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ పరిసరాల నుంచి ఖాన్‌సాయిపేట వరకు వానరాలు నిత్యం రహదారిపైనే ఉంటున్నాయి. మండలంలోని గాడుదుల గండి గుట్ట వద్ద విస్తారంగా అటవీ క్షేత్రం ఉన్నా వానరాలు రహదారిపైనే తిరుగుతున్నాయి. మంథని-కాటారం మార్గంలోని దట్టమైన అడవి గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు వేసే తినుబండారాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షిస్తుంటాయి. ప్రభుత్వాలు అడవిలో పండ్ల మొక్కలను పెంచితే కోతులు ఇలా రోడ్లపైకి రాకుండా ఉంటాయని జంతు ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

- న్యూస్‌టుడే, మంథని గ్రామీణం